సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం 12 జూలై 2025



విద్యుత్ అంతరాయాలు తగ్గాలి
విద్యుత్ అంతరాయాలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో



పెరుగుతున్న గోదావరి
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో ములుగు జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
33.7° /26.2°

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డీసీఎస్‌ఓ



భూపాలపల్లి అర్బన్: జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం కలెక్టర్ రాహుల్‌శర్మను కలిశారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

రక్షణ సూత్రాలు పాటించాలి



భూపాలపల్లి అర్బన్: ఈపీ ఆపరేటర్లు, ఎంవీ డ్రైవర్లు రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి కోసం పని చేయాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. రక్షణ నియమాలపై ఈపీ ఆపరేటర్లు, ఎంవీ డ్రైవర్లకు శుక్రవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకొని వృత్తిలో అమలు చేయాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. ప్రమాదం ఎక్కడి నుంచి వస్తుందో తెలియదన్నారు. పని ప్రారంభం నుంచే తప్పక రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్, మారుతి, విజయ్‌కుమార్, రామస్వామి, కార్మిక సంఘాల నాయకులు విజేందర్, మధుకర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలో గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా అకాడమీలలో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాకీ, అథ్లెటిక్స్ అకాడమీ గచ్చిబౌలి, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ అకాడమీ ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలబాలికలకు ఈ నెల 15, 16 తేదీల్లో అకాడమీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 12నుంచి 16సంవత్సరాల లోపు ఆసక్తిగల హాజరుకావాలని సూచించారు. విద్యార్హత, క్రీడా ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కుటుంబ కలహాలతో ఒకరి హత్య?


పరుష రవి (ఫైల్)

రేగొండ: కుటుంబ కలహాలతో ఒకరిని హత్య చేసిన ఘటన మండలంలోని తిరుమలగిరి శివారు పాండవులగుట్టలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన పరుష రవి (45) రేగొండ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం జరిపించారు. వీరి వైవాహిక జీవితం కొంత కాలం పాటు సజావుగా సాగింది. ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ క్రమంలో భార్యభర్తలిద్దరికీ గొడవలు జరగడంతో లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి రామన్నగూడెంలో ఉంటుంది. రవి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. ఆ మహిళకు ఇంతకుముందే వివాహమై కొడుకు, కూతురు ఉన్నారు. ఆ మహిళ మొదటి భర్త కొడుకు శ్రీకర్, రవి ఇద్దరు కలిసి రేగొండ మండలంలోని పాండవుల గుట్టకు గురువారం వెళ్లారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య గొడవ జరగగా రవిని శ్రీకర్ హత్య చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో సోషల్ మీడియాలో ప్రభుత్వ అధికారిణిపై తప్పుడు ప్రచారం చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ జిల్లా మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి అధికారిణి (డీడబ్ల్యూఓ)పై అసత్యపు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పట్టణానికి చెందిన మాచర్ల సంతోష్ తప్పుడు పోస్టు చేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ అధికారుల పనితీరును దెబ్బతీసే విధంగా, నిరాధారమైన ఆరోపణలు చేయడం, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయరాదని చెప్పారు. పౌరులు వాస్తవ సమాచారాన్ని తెలుసుకొని సోషల్ మీడియా వేదికలను సరైన మార్గంలో వినియోగించుకోవాలని సూచించారు.

28.78 లక్షల మొక్కలు

వారం రోజుల్లో వన మహోత్సవం ప్రారంభం

- నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు
- గతంలో నాటిన వాటిలో బతికినవి సగమే
- సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో షో మొక్కల పంపిణీ

భూపాలపల్లి: అడవుల ఖిల్లాలో వన మహోత్సవానికి అంతా సిద్ధమైంది. వారం రోజుల్లో అధికారికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ప్రారంభించనుంది. ఈ ఏడాది 28.78 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం విధించుకోగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పండ్లు, పూలనిచ్చే మొక్కలతో పాటు కొత్తకొత్త రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. గతేడాది నాటిన మొక్కలు సంరక్షణ లేక ఎండిపోగా ఈ ఏడాదైనా తగు చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

నర్సరీల్లో నీడ, పండ్లు, కొత్త కొత్త రకం మొక్కలు..

ఈ ఏడాది అటవీశాఖ నర్సరీల్లో కొత్తగా మొక్కల పెంపకం చేపట్టలేదు. గతేడాది ఉన్న మొక్కలే సరిపడా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కొత్త మొక్కల పెంపకం చేపట్టలేదు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 241 నర్సరీలను ఏర్పాటు చేసి నిర్దేశిత లక్ష్యానికి తగినట్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఆయా నర్సరీల్లో టేకు, ఎర్రతురాయి, మల్లె, దానిమ్మ, జామ, మునగ, మారేడు, బొప్పాయి, బాదం, చైనా బాదం, ఈత, నిద్రగన్నేరు, వెలగ, సుబాబుల్, సిసు, బురగా, కరివేపాకు, గులాబీ, మర్రి, మద్ది తదితర రకాల నీడ, పండ్లనిచ్చే మొక్కలను పెంచుతున్నారు.

సింగరేణిలో షో మొక్కలు

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం వివిధ రకాల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు గనులు, గనుల ఆవరణలో నాటుతున్నారు. ఈ ఏడాది సంస్థ ఐదు లక్షల మొక్కలు నాటడం లక్ష్యం నిర్దేశించుకోగా అందులో 85 రకాల మొక్కలు ఉన్నాయి. భారీ వృక్షాలుగా మారనున్నవి 55 రకాలు ఉండగా, 10 రకాల పండ్ల మొక్కలు, 20 రకాల షో మొక్కలు ఉన్నాయి. షో మొక్కలను సింగరేణి పార్కులు, గార్డెన్ల వద్ద బ్యూటిఫికేషన్ కోసం నాటనున్నారు.


మల్హర్ మండలం మల్లంపల్లి నర్సరీలో టేకు మొక్కలు



జిల్లా భౌగోళిక పరిస్థితి..

విస్తీర్ణం	2,293 చదరపు కి.మీ.
జనాభా	4,16,763
అటవీ విస్తీర్ణం	169461.23 హెక్టార్లు

ఒక్కో మొక్కకు ఖర్చు రూ.102..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2016లో ఏర్పడగా అప్పుడు సుమారు రెండేళ్ల పాటు ఏడాదికి కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించుకొని నాటేందుకు ప్రయత్నించారు. కోటి మొక్కల లక్ష్యం ఎక్కువ కావడం, నాటడం, పెంపకం ఇబ్బందికరంగా మారడంతో 2019 నుంచి 28 లక్షల నుంచి 30 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు ప్రతీ ఏటా భారీగా పెరిగే మొక్కలతో పాటు పండ్లు, నీడనిచ్చే మొక్కలను జిల్లాలోని ఖాళీ ప్రదేశాల్లో నాటుతున్నారు. జిల్లాలో ఒక్కో మొక్క పెంపకం, నాటడం, సంరక్షణకు రూ.102 ఖర్చు వస్తుంది. అయినా పూర్తిస్థాయిలో మొక్కల సంరక్షణ చేపట్టకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ శాఖ	మొక్కలు నాటే లక్ష్యం(లక్షల్లో)
డీఆర్‌డీఏ	16.74
సింగరేణి	5.00
మున్సిపల్	2.49
పోలీసు	1.20
అటవీ	1.44
వ్యవసాయ	0.58
హార్టికల్చర్	0.32
గిరిజన సంక్షేమం	0.40
కేటీపీపీ, తాడిచర్ల ఓపెన్‌కాస్ట్	0.20
ఎక్సైజ్	0.17
ఏఎంఆర్ మైనింగ్	0.12
ఇరిగేషన్	0.12
మొత్తం	28.78

బతికినవి సగమే..

జిల్లాలో ఇప్పటివరకు నాలుగు కోట్ల మొక్కలు నాటినట్లుగా అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అందులో సగం మొక్కలు కూడా బతకలేదని తెలుస్తోంది. రహదారులపై నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు తీసుకోకపోవడం, జంతువులు తినడం, ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలకు నీరు అందించకపోవడంతో అవి ఎండిపోయాయి.


పలుగుల వద్ద వంతెన నిర్మాణం చేసే ప్రాంతం

వంతెన కోసం నిరీక్షణ

ఏళ్లుగా ఎదురుచూస్తున్న రెండు జిల్లాల ప్రజలు

- పలుగుల-చెన్నూర్ మధ్య గోదావరిపై నిర్మాణానికి ప్రతిపాదనలు
- వంతెన నిర్మాణంతో తగ్గనున్న దూరభారం
- 2013లో రూ.110 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు


ఏప్రిల్‌లో మట్టి నమూనా పరీక్షలు (ఫైల్)

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజల చిరకాల వాంఛ పలుగుల-చెన్నూర్ మధ్యలో వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. గోదావరిపై బ్రిడ్జి నిర్మిస్తే రెండు జిల్లాల వాసులకు ప్రయాణ దూర భారం తగ్గడమే కాకుండా అభివృద్ధికి బాటలు పడుతాయని ఆశించిన వారికి నిరాశే మిగులుతుంది. బ్రిడ్జి నిర్మాణం కోసం మట్టి పరీక్షలు నిర్వహించిన సమయంలో ఆనందాలు వెల్లువిరిశాయి, కానీ ఏడేళ్లు గడిచినా ఆ వంతెనపై ప్రజాప్రతినిధులు ఊసెత్తడం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మంథని, చెన్నూర్ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులుగా ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గనులు, కార్మికశాఖ మంత్రిగా గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఉండడంతో వంతెన నిర్మాణంపై రెండు జిల్లాల ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు.

మట్టిపరీక్షలు చేసి ఆశలు నింపి..

మహదేవపూర్ మండలం పలుగుల వద్ద గోదావరిపైన 1.2 కిలోమీటర్ల పొడవుతో 40 పిల్లర్లతో మంచిర్యాల జిల్లా చెన్నూర్ గ్రామ గోదావరి ఒడ్డు వరకు వంతెన నిర్మాణానికి 2017 ఏప్రిల్‌లో రెండు వారాల పాటు యంత్రాలతో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. గోదావరిలో మొత్తం ఏడు చోట్ల మట్టి నమూనా పరీక్షలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఐబీఎస్ సంస్థ ఆధ్వర్యంలో 40 మీటర్ల లోతు వరకు మట్టి పరీక్షించారు. మరో చోట కుంట్లం, ఎర్రాయిపేట మీదుగా కూడా నిర్మాణం చేపట్టడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ క్రమంలో అప్పటి రోడ్డురవాణాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2017 ఫిబ్రవరి 5న పలుగుల వద్ద గోదావరి తీరాన్ని అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి సందర్శించారు.

ఏడేళ్లు గడిచినా..

పలుగుల గోదావరిలో మట్టి నమూనా పరీక్షలు చేసి ఏడేండ్లు గడిచినా వంతెన నిర్మాణంపై పురోగతి లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు నిరాశకు లోనవుతున్నారు. ప్రభుత్వం పలుగుల వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వేగం పెంచాలని స్థానికులు కోరుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో అన్నారం వద్ద వంతెన కమ్ బ్యారేజీ అందుబాటులో ఉంది. కానీ ఆ వంతెన మీదుగా భారీ వాహనాలు వెళ్లడానికి అనుమతి లేదు. పలుగుల వద్ద వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు కొమురంభీం, మంచిర్యాల జిల్లాల ప్రజలకు, మహారాష్ట్ర చంద్రాపూర్, నాగ్‌పూర్ గుండా ప్రయాణం దూరం తగ్గనుంది. పలుగుల, మద్దులపల్లి వాసులు నిత్యావసరాలకు, వైద్య, వ్యాపారపరంగా పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు వెళ్తుంటారు. ప్రస్తుతం కాళేశ్వరం, సిరొంచ మీదుగా చెన్నూర్ వెళ్లాలంటే 50-60 కిలోమీటర్ల దూరం వస్తుంది. పలుగుల వద్ద వంతెన నిర్మిస్తే 4-5 కిలోమీటర్ల దూరంతో సులువుగా చెన్నూర్‌కు చేరుకుంటామని స్థానికులు పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణంతో కొమురంభీం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలకు రవాణా సౌకర్యాలు పెరిగి దూరభారం తగ్గనుంది.

మొదట రూ.110 కోట్లతో ప్రతిపాదనలు..

2012లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మాజీ ఎంపీ, ప్రస్తుతం చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్ రూ.110కోట్ల వ్యయంతో నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి స్పీడప్ చేశారు. ఆమోదం తెలిపి నిధులు మంజూరయ్యే సమయంలో అప్పుడు ఎన్నికలు రావడంతో నిలిచింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2017లో పరీక్షలు చేసినా ఫలితం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో పాటు మంథని, చెన్నూర్‌లో మంత్రులుగా శ్రీధర్ బాబు, వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఉండడంతో మళ్లీ రెండు జిల్లాల ప్రజలకు ఆశలు చిగురిస్తున్నాయి. స్థానికులు నిధులు మంజూరుచేసి వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మించాలి



పలుగుల-చెన్నూర్ మధ్యలో వంతెన నిర్మిస్తే దూర భారం తగ్గుతుంది. పలుగుల గ్రామస్తులం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నాం. పలుగుల నుంచి చెన్నూర్‌కు(మధ్యలో గోదావరి) ఐదు కిలోమీటర్లు. ఇక్కడి నుంచి కాళేశ్వరం మీదుగా సిరొంచ నుంచి చెన్నూర్‌కు 60కిలోమీటర్లు ఉంటుంది. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. వంతెన నిర్మాణం చేపడితే అన్ని రకాల వసతులు, ప్రయాణ సౌకర్యాలు అందుతాయి. మట్టి పరీక్షలు చేసినా ఫలితం లేదు.

\- బర్ల కుమార్, పలుగుల, రైతు

రవాణా మెరుగు



పలుగుల-చెన్నూర్ మధ్య గోదావరిపై వంతెన నిర్మిస్తే రవాణా మెరుగు పడుతుంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లకు రాకపోకలు పెరిగి అభివృద్ధి జరుగుతుంది. వ్యాపార, వాణిజ్య, వైద్య పరంగా మార్కెట్ అభివృద్ధి చెందుతుంది. రైతులకు రైతు మార్కెట్, ఎరువులు, మందులు దగ్గరవుతాయి. ప్రస్తుతం చెన్నూరు నుంచి సిరొంచ మీదుగా కాళేశ్వరం వెళ్లాలంటే 35 కిలోమీటర్లు, పలుగుల వద్ద వంతెన నిర్మాణంతో 12 కిలోమీటర్లతో వెళ్లొచ్చు.

పోగుల ఉదయ్, చెన్నూర్, మంచిర్యాల జిల్లా

ఆధునిక హంగులతో పోలీస్‌స్టేషన్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలానికి నూతనంగా ఏర్పాటైన పోలీస్‌స్టేషన్‌ను ఆధునిక హంగులతో నిర్మిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం తాత్కాలిక భవనాన్ని డీఎస్పీ సంపత్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపల్లిగోరి మండలానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తారని తెలిపారు.

ఇసుక అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు తెలిపిన ధరల ప్రకారం ఇసుక సరఫరా చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా కోసం గ్రామాల్లో ఎవరైనా డంప్‌లు ఏర్పాటుచేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు సూదన బోయిన ఓంప్రకాశ్, కాటం సదయ్య, వీరబ్రహ్మం, సుదర్శన్, పత్తి తిరుపతి, పుట్ట రవి, ప్రేమాజీ, పల్లె బోయిన తిరుపతి, పసుల రాకేష్ పాల్గొన్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

స్థల పరిశీలన

రేగొండ: కొత్తపల్లిగోరి మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు చేస్తూ జీఓ విడుదల కావడంతో శుక్రవారం మండలకేంద్రంలోఎస్పీ కిరణ్‌ఖరే పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక పోలీస్ స్టేషన్ భవన సముదాయాన్ని పరిశీలించి, మరమ్మతుల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

చిట్యాల: మండలకేంద్రంలోని బేడబుడగ జంగాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించుకున్నారు. బోనాలతో గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. తమ పిల్లపాపలను చల్లంగా కాపాడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బేడబుడగ జంగాల పెద్దలు టేకు లక్ష్మయ్య, మోతె సారయ్య, ఉల్లేక్కం, టేకు రవి, సతీష్, వేణు, మహిళలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ కీలకం

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి అర్బన్: దేశ సమతుల్య అభివృద్ధి కోసం జనాభా నియంత్రణ అత్యంత కీలకమని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనాభా పెరుగుదల వల్ల జరిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కుటుంబ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వైద్యులకు ఒక్క బిడ్డ కలిగిన ఐయూసీడీ వినియోగిస్తున్న మహిళలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు డాక్టర్ సందీప్, డాక్టర్ రోహిణి, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చుట్టు పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ స్పెషల్ అధికారి, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సూచించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని సుభాష్‌కాలనీలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంటి చుట్టు పక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ రాజేశ్వరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ నిర్మల, ఆర్పీలు పాల్గొన్నారు.


డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా సూచనలు ఇస్తున్న విజయలక్ష్మి

పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- గురుకులంలో అపరిశుభ్రతపై కలెక్టర్ సీరియస్

కాటారం: గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. కాటారం మండలం దామెరకుంట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గంగారం మోడల్ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దామెరకుంట గురుకుల పాఠశాల ఆవరణ, డైనింగ్ హాల్, వంటగది, వంట సామగ్రి, కూరగాయలను ఆయన పరిశీలించారు. వంటగదిలో ఈగలు ముసురుకోవడం, వంటగది పరిసరాలు, కూరగాయలు అపరిశుభ్రంగా ఉండటంపై పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని ఆహార తయారీ ప్రదేశాలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉత్తమ విద్యాబోధన చేయాలని పేర్కొన్నారు. మళ్లీ తనిఖీకి వచ్చే సరికి ఇది పునరావృతం కావద్దని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని సమకూరుస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భవనం పెచ్చులు ఊడిపోతుందని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో తరగతి గదులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పాఠశాల వెనకాల నిరుపయోగంగా ఉన్న జూనియర్ కళాశాల భవనానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈని ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం గంగారం మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ హాస్టల్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం, వంట గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వేడినీటి కోసం గీజర్లతో పాటు కావాల్సిన మౌలిక వసతుల కోసం నివేదిక అందించాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఈఓ రాజేందర్, తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేయాలి..

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణ పనులు, భూ భారతిలో వచ్చిన దరఖాస్తుల వివరాలపై ఆరాతీశారు. మండలంలో 5610 దరఖాస్తులు రాగా 412 మంది దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగరాజు, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న ఉన్నారు.


దామెరకుంట గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

క్లుప్తంగా

అప్పు తీర్చలేక రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


రామక్రిష్ణారెడ్డి (ఫైల్)

కేసముద్రం: అప్పు తీర్చలేక మనస్థాపానికి గురైన ఓ రైల్వే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన కోమటిరెడ్డి రామక్రిష్ణారెడ్డి (38) మూడేళ్లుగా కేసముద్రం మున్సిపాలిటీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ, కురవి మండలంలోని గుండ్రాతి మడుగు రైల్వేస్టేషన్‌లో కీమాన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పు ఇచ్చిన వారు ఈనెల 9న ఇంటికి వచ్చి తమ అప్పు తీర్చాలని గొడవకు దిగారు. దాంతో అదే రోజు తీవ్ర మనస్థాపానికి గురైన రామక్రిష్ణారెడ్డి.. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి వస్తూ కేసముద్రం మండలం రాజీవ్ నగర్ తండా వద్ద గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రేప్ కేసులో ఐదేళ్ల జైలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని వాడగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రేప్ కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెంకటాపురం సీఐ బండారి కుమార్ వివరాల ప్రకారం రేప్ కేసులో జాడి రోశయ్యకు ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు నమోదు చేసిన ఎస్సై రేక అశోక్, దర్యాప్తు చేసిన ఎస్సై కొప్పుల తిరుపతి రావు, శిక్షపడేలా కృషి చేసిన ప్రాసిక్యూటర్, కోర్టు కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

చుట్ట తాగుతూ నిద్రలోకి..
నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

రఘునాథపల్లి: చుట్ట తాగుతూ ఓ వృద్ధురాలు నిద్రలోకి జారుకోగా.. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పండుగ వెంకటలక్ష్మి (95) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. చుట్ట తాగుడు అలవాటు ఉన్న ఆమె.. గురువారం ఉదయం మంచంపై పడుకొని చుట్ట తాగుతూ నిద్రలోకి జారుకుంది. ప్రమాదవశాత్తు మంచంపై ఉన్న బెడ్‌షీట్లకు చుట్ట అంటుకొని మంటలు లేచాయి. వెంకటలక్ష్మి తేరుకొని లేచే సరికి మంటలు చుట్టుముట్టాయి. ఇంట్లో మంటలను గుర్తించిన స్థానికులు వెంటనే తలుపులు ఊడదీసి మంటలను చల్లార్చగా అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి కుమారుడు పండుగ మదార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

పెరుగుతున్న గోదావరి


వాజేడు: మండల కేంద్రం సమీపంలో రహదారిపైకి చేరిన గోదావరి వరద


వాజేడు: పూసూరు, ఎడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి


వాజేడు వద్ద వరద నీటిలోకి వెళ్లకుండా ట్రాక్టర్‌ను అడ్డుగా పెడుతున్న డ్రైవర్

- నీట మునిగిన రహదారులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వాజేడు: వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి మట్టం పెరగడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో రహదారులు పలు చోట్ల ముంపునకు గురి కావడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడి కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద్ద గంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలు, పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలో కొంగల వాగు ద్వారా వచ్చిన గోదావరి వరద రహదారిని ముంచింది. దాంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచాయి. కొంగల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు వాజేడు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాలి. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంది. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలి వాగు వద్ద రహదారిపైకి గోదావరి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. వరదను పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి.. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు. రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరూ వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కంచె కట్టారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.


పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద ఉధృతి

పెరుగుతున్న నీటి మట్టం

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 14.28 మీటర్లు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 15.42 మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి నీటి మట్టం పెరుగుతున్నట్లు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల రహదారులు నీట మునిగాయి. మండల అధికారులు అప్రమత్తమై మండలంలోని పునరావాస కేంద్రాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా రహదారులపై ట్రాక్టర్లు అడ్డంగా ఉంచారు.

వరద ఉధృతి



- సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా చేరుతున్న వరద నీరు
- ఎగువ నుంచి 7,35,720 క్యూసెక్కుల నీరు
- బ్యారేజీ వద్ద 59 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువకు..


తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్ర రూపంలో ప్రవహిస్తోంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి భారీగా వరదలు చేరడంతో నిండుకుండను తలపిస్తూ దిగువకు వెళ్తోంది. వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సరస్వతి, లక్ష్మీ బ్యారేజీలలోకి భారీగా వరద నీరు చేరడంతో అక్కడ బ్యారేజీల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో దిగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద చేరుతోంది. ఈ క్రమంలో తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద శుక్రవారం గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుండి 7,35,720 క్యూసెక్కుల నీరు చేరుతోంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు 59 ఎత్తి అదేమోతాదులో దిగువకు నీటిని వదులుతున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 83.మీటర్లకుగాను 82.10 మీటర్లుగా నమోదవుతోంది. బ్యారేజీకి ఎగువన గుట్టల గంగారం పరిధిలో ఉన్న జె.చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఫేజ్ -1లో రెండు మోటార్లకు గాను 1 మోటారు తోపాటు ఫేజ్ -3లో 6 మోటార్లకుగాను రెండు మోటార్ల ద్వారా 760 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోతల వద్ద ప్రస్తుతం 83 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..


రామన్నగూడెం గోదావరి వద్ద సిద్ధంగా ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- రామన్నగూడెం వద్ద 14.48 మీటర్ల మేర వరద ప్రవాహం
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద గంట గంటకు పెరుగుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం ఉదయం 10 గంటలకు 14.09 మీటర్లు ఉండగా, రాత్రి 8 గంటలకు 14.48 మీటర్లకు చేరింది. గంటగంటకు వరద నీరు పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు (14.80 మీటర్లు) చేరువలో వరద ప్రవాహం కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను గోదావరి చుట్టూ పక్కల గ్రామాల్లో సిద్ధం చేసి ఉంచారు. వారి వద్ద పడవలు, లైఫ్‌జాకెట్లతో పాటు రబ్బర్ బోట్లను ఉంచారు. ఎక్కడైనా విపత్తు ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. కోయగూడ ఎల్లాపురం గ్రామంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలున్నాయని, ఎలాంటి భయాందోళనకు గ్రామస్తులు గురికావొద్దని అవగాహన కల్పించినట్లు రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి

ప్రాణహిత పరవళ్లు

- కాళేశ్వరం ఘాట్ వద్ద 11.790 మీటర్ల నీటిమట్టం
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద 8.68 లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో


కాళేశ్వరం పుష్కర ఘాట్ మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత వరద కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చుతూ ఉప్పొంగి ప్రవహిస్తోంది. తెలంగాణలో అంతగా వర్షాలు లేకపోవడంతో గోదావరిలో అంతగా నీరు లేదు. మహారాష్ట్ర ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు జ్ఞానదీపాలు నీటమునిగి కొంతమేర మాత్రమే పైకి కనిపిస్తున్నాయి. రాత్రివరకు పూర్తి స్థాయిలో మునిగిపోనున్నాయి. దిగువన ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుండగా, 85గేట్లు ఎత్తివేయడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు ఇంజినీరింగ్ అధికారులు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని గోసిపుర్డ్ డ్యామ్ నీరు వదలడంతో రాత్రి వరకు మరింత వరద నీరు చేరుతుందని తెలిసింది.

టేకులగూడెం వంతెన మూసివేత

ములుగు రూరల్: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధాన జాతీయ రహదారి నంబర్ 163పై టేకులగూడెం వంతెనను మూసి వేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకులగూడెం శివారులో రేగమాగు వాగు పొంగి వంతెన మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని పేర్కొన్నారు. వరద ఉధృతి కారణంగా వంతెనపై ప్రయాణాలను నిషేధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా వెళ్లాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ అంతరాయాలు తగ్గాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో ముందుగా వేయి ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్లు 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉండే పొడవాటి లైన్లలో అమర్చుతున్నట్లు తెలిపారు. తద్వారా విద్యుత్ అంతరాయాలను త్వరగా గుర్తించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ నెలలో 30 సబ్‌స్టేషన్లలో, వచ్చే నెలలో 120 సబ్ స్టేషన్లలో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్‌లు, వంగిన స్తంభాలు, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్‌ను గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే లైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వేణుబాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

కంబాలపల్లి పాఠశాలకు అరుదైన అవకాశం

- ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామ్యం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన అవకాశం దక్కింది. ఐఐటీ మద్రాస్ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఎంపికైంది. ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లా నుంచి ఇప్పటి వరకు ఈ ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న పాఠశాలలు మొత్తం ఐదు కాగా, కంబాలపల్లి పాఠశాల వాటిలో ఒకటిగా ఎంపిక కావడం విశేషం. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఆధునిక రంగాల్లో విద్యను అందించడంతోపాటు భవిష్యత్‌లో తగిన కెరీర్ ఎంపిక చేసుకునే అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు 8 వారాలపాటు 10 ఆన్‌లైన్ కోర్సులు చదివే అవకాశం కలుగుతుంది. ఈ కోర్సులను ఐఐటీ మద్రాస్, ఇతర ప్రముఖ విద్యాసంస్థల నిపుణులు రూపొందించారు.



కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కోర్సుల వివరాలు	ప్రధాన అంశాలు	మరింత సమాచారం
డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పరిచయం ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ పరిచయం ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ పరిచయం ఇంజినీరింగ్ బయాలాజికల్ సిస్టమ్స్ పరిచయం ఫన్ విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్ లా పరిచయం మ్యాథ్స్ గేమ్స్ అండ్ పజిల్స్ ఏరోస్పేస్ ఫండమెంటల్స్ వంటి మొదలైన అంశాలపై శిక్షణ	కోర్సుల వ్యవధి : 8 వారాలు (ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి ప్రారంభం) పరిశీలన : ప్రతి కోర్సుకు రూ.500 మాత్రమే రుసుం సర్టిఫికెట్ : కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఇ–సర్టిఫికెట్ లభిస్తుంది	విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలి కోర్సు అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ జారీ చేస్తారు పాఠశాల తరపున బాధ్యత వహించే విధంగా పాఠశాల (గణితం) సహాయ ఉపాధ్యాయులు కాసం శ్రీనివాసరావు ఎస్పీఓసీ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్)గా నియమితులయ్యారు

జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ సందర్శన

వరంగల్ చౌరస్తా: రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. జోధ్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రాంసింగ్ సిసోడియా, పండ్లు, కూరగాయల మార్కెట్ సెక్రటరీ దుర్గారామ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజేందర్ పరివార్, కార్యదర్శి ధర్మేందర్ బండారి, కార్మిక నాయకులు సకూర్ ఘోరీతో సంఘం జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు, ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అక్కడ రైతుల నుంచి పంట దిగుమతి చార్జీలు మినహా ఎలాంటి మార్కెట్ చార్జీలు వసూలు చేయడం లేదని, మార్కెట్ సెస్ రూ.100కు 1.50 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్మిక చార్జీలు నూటికి 3.60 రూపాయలు పంట కొనుగోలుదారుడు చెల్లిస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లలో పంటలను విక్రయించే కమిషన్ ఏజెంట్లు అదనంగా రైతుల నుంచి కమిషన్, మునిం, దానం, ధర్మం కూటుకు కిలో పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హర్యానా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని వ్యవసాయ మార్కెట్ చట్టాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ చట్టాలను సవరించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు సంగతి సాంబయ్య, చంద్రశేఖర్, మాదం తిరుపతి, సందెపోగు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జోధ్‌పూర్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

గంజాయి మత్తులో యువత వీరంగం

- ఇద్దరిపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం
- ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు


కేడల నరేష్


బజ్జూరి వంశీ

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువత గంజాయి మత్తులో వీరంగం సృష్టిస్తోంది. అర్ధరాత్రి వరకు బైకుల హారన్ల మోత, కేరింతలతో రహదారులపై ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో బీట్ పోలీసులు ఉన్నా లేనట్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడిగింది ఇవ్వకపోతే చిరువ్యాపారులపై మత్తులో ఉన్న పోకిరీలు విచక్షణ రహితంగా దాడికి తెగబడుతున్నారు. ఈ తరహా ఘటన గురువారం అర్ధరాత్రి వరంగల్ శంభునిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్డులోని ఓ ఐస్‌క్రీమ్ బండి వద్ద కొంతమంది ఐస్‌క్రీమ్ తిన్నారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే ఆ చిరు వ్యాపారితో పాటు అడ్డుకోబోయిన కేడల నరేష్, బజ్జూరి వంశీపై ఆకతాయిలు దాడికి చేశారు. ఈ దాడిలో కేడల నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు సమాచారం.

మృతదేహం మా వారిది కాదు..

- దహన సంస్కారాలు చేసే సమయంలో కుటుంబ సభ్యుల గుర్తింపు
- తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- పోలీసుల వినతి మేరకు పోస్టుమార్టం లేకుండా బంధువులకు అప్పగించాం
- ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ వెల్లడి


ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) మృతదేహం

రాయపర్తి: 'రోడ్డు ప్రమాదంలో నీ భర్త మృతిచెందాడ'ని పోలీసులు సమాచారం అందించడంతో వరంగల్ ఎంజీఎంకు వెళ్లిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసే క్రమంలో మృతదేహం తమవారిది కాదని గుర్తించి.. తిరిగి ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ విచిత్ర ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన గోక కుమారస్వామి(55), రమకు ముప్పయి ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కూతురు. ఇరవై ఏళ్ల క్రితం కుమారస్వామి మతిస్థిమితం కోల్పోగా అప్పటినుంచి రమ వేరుగా ఉంటున్నారు. అతను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణకేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. తొర్రూరులో ఈనెల 09వ తేదీన రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు, పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు గురువారం మృతిచెందాడు. ఈ క్రమంలో ఎంజీఎంనుంచి పోలీసులు 'నీ భర్త చనిపోయాడని' మైలారానికి చెందిన గోక రమకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వెళ్లిన రమ, కుటుంబ సభ్యులకు మార్చురీనుంచి చాపతో చుట్టిన మృతదేహాన్ని అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా మైలారంలోని దహనసంస్కారాలు చేసే స్థలానికి తీసుకొచ్చారు. కిందికి దించి చాప విప్పి చూడగా కుమార్తె స్వప్న ఆ మృతదేహాన్ని చూడగా తన తండ్రి చేతిపై శ్రీ అనే పచ్చబొట్టు ఉంటుందని, ఈ మృతదేహానికి పచ్చబొట్టు లేదని, తమ నాన్న కాదని తేల్చిచెప్పింది. భార్య, బంధువులు సైతం చూసి తమవారిది కాదని చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని అదే అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. రమ తన భర్తను చాలా ఏళ్లుగా చూడకపోవడం.. చాపలో చుట్టి ఇవ్వడం వల్ల గుర్తించలేకపోయినట్లు కొందరు అంటున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఆ మృతదేహం ఎవరిది అన్నది గుర్తించాల్సి ఉంది.

పోలీసుల వినతి మేరకే..

ఎంజీఎం : ఈ నెల 9వ తేదీన అపస్మారకస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఎంజీఎంకు తీసుకువచ్చారని, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎంజీఎం ఆర్ఎంఓ శశికుమార్ తెలిపారు. కాగా, సదరు వ్యక్తి మృతదేహం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన కుమారస్వామిగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోస్టుమార్టం లేకుండా అప్పగించాలనే పోలీసుల వినతి మేరకు ఆ మృతదేహాన్ని భార్య, బంధువుల అంగీకారం మేరకు అప్పగించినట్లు ఆర్ఎంఓ తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు తమది కాదని పేర్కొని తిరిగి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.